క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చంద్రుగొండ: మండలంలో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చంద్రుగొండ మండలంలో ఘర్షణలకు పాల్పడుతున్న కొంతమందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాన్ని ఎవరు చేతిలో తీసుకున్నా.. ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రతీ ఒక్కరూ జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ ప్రారంభం

భద్రాచలంఅర్బన్: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, పిల్లలకు అందిస్తున్న టీకాల మూడో విడత ఈ నెల 23న జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కాగా.. భద్రాచలంలో మంగళవారం ప్రారంభమైంది. భద్రాచలంతో పాటు నర్సాపురం పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 50 మంది చిన్నారులతో పాటు 10 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ రెండు పీహెచ్‌సీలలో టీకాలు వేయనున్నట్లుగా మెడికల్ ఆఫీసర్ సుభాష్ తెలిపారు.

పాఠశాలలో తనిఖీ

అశ్వారావుపేటరూరల్: ఉపాధ్యాయుల్లో పోటీతత్వం ఉండాలని స్థానిక ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని దొంతికుంట వద్దగల ప్రాథమిక పాఠశాలను ఉదయం ప్రార్థనా సమయానికే ఆకస్మికంగా సందర్శించారు. ఆ తర్వాత విద్యార్థుల సామర్థ్యాలను, హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల్లో పోటీతత్వం పెరగాలని, పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. హెచ్‌ఎం.విజయబాబు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, సావిత్రి, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలంలో సుభాష్‌నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీఓ బొగ్గా నారాయణ తెలిపారు. మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులకు సూచనలు చేశారు. హౌసింగ్ ఏఈ హేమంత్‌కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

మారిన ఫోన్ నంబర్లు

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లోని సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. ఈ మేరకు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గుండాల సబ్ స్టేషన్ 871248594, మామకన్ను సబ్ స్టేషన్ 8712485947, గుండాల ఏఈ 8712485941, గుండాల లైన్ ఇన్స్‌పెక్టర్ 8712485942, ఆళ్లపల్లి సబ్ స్టేషన్ 8712485946, ఏఈ 8712485941, లైన్ మెన్ 8712485944 నంబర్లు కేటాయించారు.

షెడ్యూల్ ప్రకటించాలి

దుమ్ముగూడెం: రాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో యూనియన్ సభ్యత్వ క్యాంపెయిన్‌లో పాల్గొని పాఠశాలల ఉపాధ్యాయులతో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, సురేష్,నాయకురాలు ఐ.అనసూయ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యురాలు చిన్నక్క, రమేష్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

కరకగూడెం: మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటుకు చొరవ చూపాలని కోరుతూ మంగళవారం ఆటో యూనియన్ సభ్యులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఆటో యూనియన్ సభ్యులు యలగొండ శ్రీను, కొమరం సాంబశివరావు,గుడ్ల రంజిత్, ఇలియాజ్, కొమరం శ్రీకాంత్, ముత్యాల మధు, సిద్ధి వినయ్, సతీష్, కణితి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి

బూర్గంపాడు: గోదావరి వరద బాధితులకు మెరక ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు కూలీ సంఘం, ప్రగతిశీల మహిళ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గోదావరి వరద బాధితులతో కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది గోదావరి వరదలు రాకముందే సర్వే నెంబర్ 437లోని ప్రభుత్వ భూమిలో వరద బాధితులకు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందజేశారు. నాయకులు తోలెం మమత, కుంజా సోమక్క, సొంది గోపమ్మ, గంజి కోటమ్మ, శాంతికుమారి, కుంజా వెంకటేశ్వర్లు, కారం నర్సింహారావు పాల్గొన్నారు.



ఊయల లేకుండా మిగిలిపోయిన స్టాండ్



రంగు వెలసి కళ కోల్పోయిన గాంధీ విగ్రహం



వాకింగ్ ట్రాక్‌పై అల్లుకున్న చెట్ల పొదలు

ప్రకృతి వనం.. కళావిహీనం

- గడ్డిపొదలతో నిండిపోయిన వనం
- శిథిల స్థితికి చేరుతున్న వస్తువులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



ములకలపల్లి వైఎస్సార్ నగర్ పల్లె ప్రకృతి వనం ఇదే..

ములకలపల్లి: ఆహ్లాదాన్ని పంచుతూ, పచ్చదనం పరిఢవిల్లుతూ ఉండాల్సిన పల్లె ప్రకృతి వనం కళావిహీనంగా మారింది. ములకలపల్లి మండల కేంద్రంలోని వైఎస్సార్ నగర్ సమీపంలోని పల్లె ప్రకృతి వనం పరిస్థితి ఇది.

గతమెంతో ఘనకీర్తి

ఐదేళ్ల క్రితం సుమారు హెక్టారు విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పల్లె ప్రకృతి వనంలో పలుజాతుల పూల మొక్కలు, వివిధ వృక్షజాతుల మొక్కలు నాటారు. వాకింగ్ ట్రాక్ వేశారు. పిల్లలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇచ్చేలా జారుడు బల్ల, ఉయ్యాలలు ఏర్పాటు చేశారు. సిమెంట్ బల్లలు వేశారు. దాత సహకారంలో మహాత్మా గాంధీ విగ్రహం పెట్టారు.

నిర్వహణ లోపంతో..

ఇంతవరకూ బాగానే ఉన్నా గత కొంతకాలంగా ఆలనా పాలనా లేకపోవడంతో గడ్డి, చెట్లు పెరిగిపోయాయి. పొదల్లా తయారయ్యాయి. దీంతో ఈ ప్రదేశం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మహాత్ముని విగ్రహం రంగు వెలసిపోయింది. దాత పేరున ఏర్పాటు చేసిన శిలాఫలకం ఊడిపోయింది. జారుడు బల్లా తుప్పుబట్టి నిరుపయోగంగా మారింది. ఇనుప ఉయ్యాలలు మాయం కాగా, స్టాండ్ మాత్రమే మిగిలిపోయి ఉంది. సిమెంట్ బల్లలు విరిగిపోయి. కూర్చోవడానికి వీలులేకుండా ఓవైపు ఒరిగిపోయి ఉన్నాయి. ఇలా ప్రజాధనం వెచ్చించి నిర్మించిన పార్కు శిథిలావస్థకు చేరడంతో.. స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు ఈ ప్రకృతి వనంపై దృష్టి సారించి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరుతున్నారు.

ఇళ్ల మంజూరు పత్రాల అందజేత



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: ప్రజాభవన్‌లో మంగళవారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3500 ఇల్లు మంజూరైనట్లు, ఈ సందర్భంలో మున్సిపాలిటీలో మొదటివిడుతలో 270 మందికి ఇల్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. వారందరికీ పత్రాలు అందజేశారు. మండలంలోని కట్టుమల్లారంలోని లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపనలో పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో సుమారు రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. రూ.25లక్షల సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన బాలికల హైస్కూల్ నూతన గదుల నిర్మాణాన్ని ఎంఈఓ స్వర్ణజ్యోతితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రైతు భరోసా వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ అద్దంకి నరేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, శివ, సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడిబాబు, గోరంట్ల కనకయ్య, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై సదస్సు



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరురూరల్: సమాజంలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరిపించడం చట్టవిరుద్ధమన్నారు. దానివల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని తెలిపారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం నాగశ్రీ, మండల లీగల్ ఎయిడ్ సభ్యులు పోశం భాస్కర్, పద్మావతి, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం..

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చిన రాయిగూడెంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సునీల్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటిని సందర్శించి జ్వరపీడితుల నుండి రక్తన మూనాలు సేకరించి ఆర్‌డీటీ పరీక్షలు చేసి.. ఎవరికి మలేరియా నిర్ధారణ కాలేదని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూప, ఎంఎల్‌హెచ్‌పీ జయమ్మ, వైద్యసిబ్బంది రాంప్రసాద్, వెంకటలక్ష్మి, రవి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల తాగునీటి కోసం ఆర్టీసీ యాజమాన్యం వాటర్ కూలర్లకు ఆర్‌ఓ ప్లాంట్ నిమిత్తం భద్రాచలం బస్ స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు, ముత్తంగి బుచ్చి రామయ్య, యతిరాజుల చారిటబుల్ ట్రస్ట్ రాజమండ్రికి చెందిన వారిని సంప్రదించగా మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ లో రూ.45లు విలువ గల ఆర్వో ఫిల్టర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో ఫిల్టర్స్‌ను విరాళంగా ముత్తంగి బుచ్చి రామయ్య, రాజుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను డిపో మేనేజర్ తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ గౌతమి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో అల్లం నాగేశ్వరరావు లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం బాధ్యులను సంప్రదించి రూ.1.25 లక్షలతో ఆర్వో ప్లాంట్ కూలర్ ఏర్పాటు చేశారని గుర్తు చేసుకున్నారు. అంతే కాకుండా భద్రాచలం బస్టాండ్ లో తరచూ దొంగతనాలు జరుగుతుండటంతో కొత్తగూడెం వస్త్ర షాపు వారి ద్వారా సీసీ కెమెరాలు అల్లం నాగేశ్వరావు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏరియర్స్ విడుదల చేయాలని సమ్మె

మణుగూరుటౌన్: 22 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల ఏరియర్స్‌ను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ యూనియన్ సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్మికులు సమ్మె బాట పట్టారు.

ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడారు. కార్మికులకు మూడు నెలల ఏరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పల్లపు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, రమాదేవి, హరీశ్, నర్సయ్య, చంద్రయ్య, పద్మ, రామ్మకృష్ణ, సతీష్, పుల్లయ్య, దుర్గయ్య, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

దమ్మపేట: ఆఫ్‌టైప్ పామాయిల్ మొక్కల వలన నష్టపోయిన రైతులకు తగు నష్ట పరిహారంను చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ఆయిల్ ఫెడ్ నర్సరీల ద్వారా పంపిణీ అయిన మొక్కల్లో ఆఫ్ టైప్ రావడానికి గల కారణాలను సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తల సమక్షంలో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో, మొక్కల పెంపకంలో అవినీతికి పాల్పడిన అధికారులను గుర్తించి, తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రూడ్ పామాయిల్ ధరపై దిగుమతి సుంకంను పెంచి, పామాయిల్ ధర పెరిగేలా చేసి, రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల అర్జున్, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, కొప్పుల శ్రీను, పిల్లి నాయుడు, మురహరి రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు పుల్లయ్య

27న వేలం పాట

దుమ్ముగూడెం: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవస్థానానికి సంబంధించిన ఫ్యాన్సీ షాపు లైసెన్సు, చెక్కబొమ్మల షాపు, కొబ్బరిచిప్పల సేకరణ, ఫోటోలు తీసే లైసెన్సు, పాదరక్షలు భద్రపరచు లైసెన్సు హక్కుల కోసం ఈ నెల 27న ఉదయం 11 గంటలకు భద్రాచలం దేవస్థానం కార్యాలయం (తానీషా కల్యాణ మండపం) వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సెల్ ఫోన్ అప్పగింత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్‌లో పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి బాధితుడికి మంగళవారం స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు అప్పగించారు. గిరిజన కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్ గాపనిచేస్తున్న భూక్య బాలు తన ఫోన్‌ను భద్రాచలం డిపోకు చెందిన ఖమ్మం వెళ్లే బస్సులో పోగొట్టుకున్నారు. అదే బస్సుల్లో కండక్టర్ విధులు నిర్వహిస్తున్న సురేఖకు ఆ సెల్ ఫోన్ దొరకడంతో, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావుకు అప్పజెప్పారు. ఆ ఫోన్‌కు వచ్చే కాల్స్ ఆధారంగా ఆది ఎవరి ఫోనో తెలుసుకుని, బాధితుడు బాలుకి అప్పగించారు.

శిథిలావస్థలోని క్వార్టర్లు కూల్చివేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఉన్న టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బంది నిమిత్తం గతంలో పోలీస్ స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం చేశారు. ఈ క్వార్టర్స్ గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చెరుకోగా.. మంగళవారం సీఐ నాగరాజు రెడ్డి క్వార్టర్స్‌ను జేసీబీ యంత్రాల ద్వారా వీటిని కూల్చివేశారు. వీటి స్థానంలో నూతన క్వార్టర్స్ నిర్మాణం చేస్తారా, లేక వేరే చోట నిర్మాణం చేపడతారా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యేను కలిసిన నూతన తహసీల్దార్

అశ్వాపురం: మణుగూరులో ప్రజా భవన్‌లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మంగళవారం మండల నూతన తహసీల్దార్ మణిధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే తహసీల్దార్‌కు శుభాకంక్షలు తెలియజేసి ప్రజలకు రెవెన్యూ సేవలు పారదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు. భూ భారతి సదస్సులో భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

సాక్షినెట్‌వర్క్: సామ్రాజ్యవాద, దురాక్రమణ కాంక్షతో ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తోందని వామపక్ష నాయకులు అన్నారు. ఈ మేరకు దాడులను ఖండిస్తూ మంగళవారం పలు ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. అమెరికా దుశ్చర్యను ప్రపంచ దేశాలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని శ్రీనగర్ కాలనీ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 38 మంది విద్యార్థులకు గ్రామస్తులు జంజూరి రాజసింహ, పొడుతూరి, వరప్రసాద్ ఆర్థిక సహాయంతో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు మంగళవారం పంపిణీ చేశారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో 5గురు విద్యార్థులకు పలకలు, బలపాలు అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన



అశ్వారావుపేటరూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న పోలీసులు

అశ్వారావుపేటరూరల్: మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అశ్వారావుపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, రింగ్‌రోడ్ సెంటర్‌లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రదర్శన చేపట్టి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత్తుపదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, క్రయవిక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై యయాతిరాజు, అదనపు ఎస్సై రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి

పినపాక: మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత సహకరించాలని సీఐ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మాదకద్రవ్యాల నివారణ వారోత్సవాల్లో భాగంగా పినపాక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. మాదకద్రవ్యాలతో మనిషి స్థిరత్వాన్ని కోల్పోతాడని, శారీరకంగా, మానసికంగా దెబ్బతింటాడని హెచ్చరించారు. ఎస్ఐ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

మణుగూరురూరల్: అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్ సర్వీస్‌ను నడపనున్నట్లు టీజీఆర్‌టీసీ మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జులై 8వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ సర్వీస్ మణుగూరు డిపో నుంచి బయలుదేరి భద్రాచలం, కొత్తగూడెం, శ్రీకానిపాకం శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయం, గోల్డెన్ టెంపుల్ మీదుగా 10న అరుణాచలం చేరుకుంటుందన్నారు. స్వామి వారి దర్శనం తర్వాత మణుగూరుకు తిరుగు ప్రయాణం అవుతుందని వెల్లడించారు. ఈ బస్ సర్వీస్‌కు పెద్దలకు రూ.5,500, పిల్లలకు రూ.2,750లుగా రేటు నిర్ణయించాని, ఆన్‌లైన్‌లో సైతం రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9959225963,7382858121, 6305335304 నంబర్లను, రిజర్వేషన్ కోసం 55444 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దుమ్ముగూడెం: నిల్వ నీటిని పరిశీలిస్తున్న డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి

దుమ్ముగూడెం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ములకపాడు, అచ్చితాపురం గ్రామాలను వైద్య సిబ్బంది సందర్శించింది. ఈ సందర్భంగా డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి గ్రామస్తుల ఇంటి పరిసరాలను పరిశీలించారు. నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని అవగహన కల్పించారు. అనంతరం ఆర్‌ఎంపీల క్లినిక్‌లను సందర్శించారు. పరిమితికి మించిన వైద్యం చేయొద్దని హెచ్చరించారు. ల్యాబ్‌లు కూడా అనుమతులు లేకుండా నిర్వహించవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గంగాధర్, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

దమ్మపేట: ఇంటి పరిసరాలు, ప్రాంగణంలో నీటి నిల్వలు లేకుండా పారబోయాలని మండలంలోని పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దివాకర్ గ్రామస్తులకు సూచించారు. మంగళవారం పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించగా, అంకంపాలెంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామాల్లోని ఇంటి పరిసరాలలో ఉన్న పూలకుండీలు, కొబ్బరి బొండాలు, పాత టైర్లు తదితర సామాగ్రిలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. జ్వర సంబంధిత లక్షణాలు కనిపిస్తే, వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దివాకర్‌తో పాటుగా స్టాఫ్ నర్సులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీఎంఓ రమేష్

చంద్రుగొండ: విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలుంటాయని గిరిజన సంక్షేమ శాఖ (ఐటీడీఏ) ఏసీఎంఓ కాసరి రమేష్ హెచ్చరించారు. మండలంలోని తిప్పనపల్లి తండా, బాలికుంట గ్రామాల్లోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. గత ఏడాది ఉద్దీపకం ద్వార తెలుగు, ఇంగ్లీష్, గణిత పాఠ్యాంశాల్లో చదవడం, రాయడంలో విద్యార్థులు సాధించిన ప్రగతిని అయన అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎస్‌ఈఆర్‌పీ హరిలాల్, ఉపాధ్యాయులు ఇస్లావత్ వీరన్న, డి.నాను పాల్గొన్నారు.

రైతు భరోసాపై హర్షం

ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రైతుల అకౌంట్‌లో నగదు జమ చేయడంపై మంగళవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలుచోట్ల సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచారు. మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి రైతుల నుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయగా.. రైతు వేదికల్లో ఆయా ప్రాంతాల్లోని రైతులు పాల్గొని వీక్షించారు. ఆపై రైతు వేదికల్లోనూ రైతు భరోసాపై సంబురాలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



ములకలపల్లి: రైతువేదిక వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



మణుగూరుటౌన్: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



దుమ్ముగూడెం: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రైతులు



బూర్గంపాడు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు..



దమ్మపేట: సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు, నాయకులు, రైతులు



చంద్రుగొండ: రైతువేదికలో వీసీకి హాజరైన అధికారులు, రైతులు..



కరకగూడెం: సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు